# జీవితం సశేషం

వడలి రాధాకృష్ణ

'నిర్జీవమైన గతం ఎప్పుడూ హృదయంలో గుచ్చుకున్న ముల్లులాంటిది. అది అప్పుడప్పుడు కదిలి గాయాన్ని రగిలించడమూ, బాధను కలిగించడమూ సహజం. దానికి విచారించవలసిన పనిలేదు. ఎందుకంటే మనిషి మార్చలేనిది ఏదైనా ఉంటే అది గతాన్నొక్కదాన్నే.'

ఉదయాన్నే స్నానంచేసి ప్రశాంతంగా ఫ్యాన్ క్రింద కూర్చుని పేపరు చదువుకుంటున్న రాజశేఖరానికి పెరట్లో నుండి అరుంధతి మాటలు బిగ్గరగా వినబడుతున్నాయి.

''వెధవ సంత వెధవ సంతాని. వీళ్ళకి మా సమస్యలు తెలీవు. చెప్పా పెట్టకుండా పని మానేస్తారు. మరునాడు వచ్చి నాలుగు కల్పించి చెబుతారు. ఈ బండ చాకిరి చేయలేక ఛస్తున్నాను. ఈ అంట్లు తోమడం, బట్టలు ఉతకడంతోనే రోజంతా సరిపోతోంది. కూటికి లేకపోయినా పోకులకీ, షికార్లకీ కొదవ లేదు. వీళ్ల గొంతెమ్మ కోర్కెలు ఎవరు తీర్చగలడు'' సణుగుతూ లోపలికి వస్తున్న భార్యని ఉద్దేశించి-

''అరూ! ఏమైంది. విషయం ఏమిటి?''

''ఏముందీ! పనమ్మాయికి నేనిచ్చే మూడువందల జీతం చాలడం లేదుట. మరో రెండువందలు పెంచమంటోంది. కుదరదు అని చెప్పాను. చెప్పా పెట్టకుండా ఈ రోజు రావడం మానేసింది. మొత్తం పనులన్నీ చేయలేక ఛస్తున్నాను.''

''అవును. నిన్న నన్నూ అడిగింది. అయ్యగారూ! దయచేసి జీతం పెంచండి. అడగలేక అడుగుతున్నాను. కనీసం ఐదువందలు ఉంటేనేగానీ నూకలు కూడా రావడంలేదు అంటోంది.''

''మరి మీరేమన్నారు?''

''ఏమంటాను అమ్మగారితో చెప్పు. ఆవిడ చూస్తుంది అని ఊరుకున్నాను.''

''గొప్పలకి పోయి మీరేమీ జీతాలు పెంచనవసరం లేదు. ఆమె కాకపోతే దానికి తగ్గ పనిమనిషి మరొకామె రెండువందలకే వస్తుంది'' కాఫీ తయారు చేయడానికి స్టవ్ వెలిగిస్తూ అంది.

''సరే... నిన్న ఉత్తరాలు ఏమైనా వచ్చాయా? రాత్రి రావడం ఆలస్యం అవడంతో అడగడం మర్చిపోయాను.''

''వచ్చాయి. సుధ నుండి ఒకటి, ఓబులేసు నుండి మరొకటి. అక్కడ టీపాయ్‌మీద ఉండాలి చూడండి.''

అపురూపంగా కూతురు రాసిన ఉత్తరం చదువుకున్న రాజశేఖరం ముఖంలో రంగులు మారాయి. ఆమె ఉద్దేశ్యం తెలుసుకున్న అతని మనస్సు చివుక్కుమంది. కన్నకూతురని సంక్రాంతి పండక్కి వాషింగ్ మెషిన్ కొనుక్కోమని ప్రేమతో పదివేల రూపాయలు పంపించాడు. అలా చేసినందుకు ఆమె ఎంతగానో సంతోషిస్తుందని ఆశపడ్డాడు.

కానీ ''మేము కొందామనుకుంటున్న మెషిన్ ఖరీదు ఇరవై వేల రూపాయలుదాకా వుంటుంది. నువ్వు పంపిన సొమ్ము సరిపోదు. అందుచేత ఈ డ్రాఫ్ట్‌ని రిటర్న్ చేస్తున్నాను. పంపదల్చుకుంటే ఇరవై వేలు పంపు. లేకుంటే అసలు వద్దు. మీ అల్లుడు కూడా ఇదే మాట వ్రాయమన్నారు'' కన్నకూతురు అలా రాస్తుందని ఊహించలేదు.

రాజశేఖరం ఒంటరి మనసు ఎప్పుడో ఒకసారి గతంలోకి జారి కూతురు సుధకు సంబంధించిన చీకటి వెలుగుల మధురానుభూతుల్ని గుండె లోతుల్లోంచి తడుముకుంటూ నిశ్శబ్దంగా బావురుమంది.

గతంలో ఆమెకు ఎన్ని ముద్దుముచ్చట్లు జరపలేదు. మిగిలిన సొమ్ము కలుపుకుని వాళ్ళు తమకు నచ్చిన దానిని కొనుక్కోవడం మాని ఇలా తిరిగి పంపడం బాధ కలిగించింది రాజశేఖరానికి.

బరువెక్కిన మనసుతో ఆలోచనలో పడ్డ అతని దృష్టి ఓబులేసు రాసిన కవరు మీద పడింది.

వీడొకడు అమాయక చక్రవర్తి. అయ్యగారూ! అయ్యగారూ! అంటూ అపురూపంగా విశేషాలు రాస్తుంటాడు. తమ పొలంలోని తాటి చెట్టు ఆకులు అమ్మినాడుట. వాటిని అమ్మగా వచ్చిన ఎనభై రూపాయలను పంపాడు. లేమితనం మనుషుల్లో నిజాయితీని నిలబెడుతుందనడానికి నిదర్శనం బహుశా ఇదేనేమో!

ఎక్కడో మారుమూల గ్రామం మల్లేశ్వరంలో తన కున్న కొద్దిపాటి పొలాన్ని కౌలుకి వ్యవసాయం చేసే వ్యక్తి ఓబులేసు. ప్రతి సంవత్సరం మక్తా క్రమం తప్పకుండా పంపుతుంటాడు. ఈ రోజుల్లో ఓబులేసు లాంటి మనుషులు బహుశా అరుదు. లేమితనం తనని వెక్కిరిస్తున్నా లేకితనంలేని మనిషి అతను.

ఓబులేసుది తన కులం కాదు, మతం అంతకన్నా కాదు. అయినా ఏమిటీ స్వామిభక్తి, సిన్సియారిటీ! ప్రపంచంలో నీతి ఎక్కడైనా బ్రతికి వుంటే బహుశా ఇలాంటి వ్యక్తులలోనే ఉండి వుంటుంది.

''అయ్యగారూ! మీరూ అమ్మగారు చల్లగా ఉండాలి. సుధమ్మగారు ఎలా ఉన్నారు? అడిగానని చెప్పండి. ఈ సంవత్సరం గోస్తనదికి వచ్చిన వరదలకి పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. నాకు ఏమీ మిగలకపోయినా మీకు ఇవ్వవలసిన ధాన్యం తాలూకు సొమ్ము పంపుతున్నాను. కామందులు ఈ సంవత్సరం నుండి వారి వారి పొలాలకి ఎకరానికి రెండు బస్తాలు శిస్తు పెంచారు. నేను కూడా అలా చేస్తాను. మామిడి చెట్లు పూత పట్టింది. దిగుబడి రాగానే మీకు పంపుతాను.''

వాడు వ్రాసే ఉత్తరాలు చదువుతుంటే ఆనందంతో మునిగిపోతాడు రాజశేఖరం.

అసలు వాడికి తను ఏమి ఉపకారం చేసాడు? ఆలోచించుకుంటే ఏమీ చేయలేదనిపిస్తుంది.

''ఏరా! నీలాగే నీ కొడుకు ఉండిపోకూడదు. మంచిగా చదివించి ప్రయోజకుడ్ని చేయి. పై చదువులు చదివి వాడు మంచి ఉద్యోగస్థుడు కావాలి'' ఆ మాటలు తనంటే విని పొంగిపోయేవాడు.

మొత్తానికి కష్టపడి చదివించి కొడుకుని ప్రయోజకుడ్ని చేసాడు.

''కాఫీ టేబుల్‌మీద పెడితే తీసుకోక ఆ పరధ్యానం ఏమిటి? అయినా మీ ముద్దుల కూతురు కోర్కెలకి అంతు ఎక్కడ? అమ్మానాన్నలు బాధపడతారనే జ్ఞానం కూడా లేకుండా డ్రాఫ్ట్ తిప్పి పంపేసింది. ఇక దానికి ఏమీ ఈయనవసరంలేదు. దాని మొగుడు సంపాదించుకోవడం లేదా పొగరుగానీ'' భార్య మాటలు కొంత ఉపశమనాన్నిచ్చాయి రాజశేఖరానికి.

ఈ ప్రకృతిలో మానవుడు తనలోని అంతర్గతమైన బలహీనతలతో అసంపూర్ణంగా మిగిలిపోతుంటాడు. అది సృష్టి నైజం. నాదీ, నేనూ అనుకుని సాటివాడ్ని చేరదీసి అక్కున చేర్చుకున్న ప్రతిసారీ నాది అనుకున్నదే తనకు ఎదురుతిరిగి విషసర్పాలై తనని కాటేస్తుంటాయి. ఫలించని ఆశయాలు నిర్వీర్యమైనప్పుడు బ్రతుకు శేష ప్రశ్నగా మిగిలిపోతుంది. చివరికి ఆ జీవితం అర్థాన్ని కోల్పోతుంది.

అనంతమైన తన జీవితంలో అనేకానేక సంఘటనలు అలసిపోయినప్పుడు వెన్నుతట్టి ఫర్వాలేదని ముందంజ వేయించే అంధకారం ఆశాదీపికలు.

రాజశేఖరం ఊహలు ఒకనాటి తన ఉద్యోగ జీవితం వైపు పరుగులు తీసాయి.


• • •

రాజశేఖరం ఒక బ్యాంకు ఉద్యోగి. భార్య అరుంధతి, కూతురు సుధ. నలుగురితోనూ మంచిగా తలలో నాల్కలా ఉండే అతను ఎవరికైనా సహాయం చేయడంలో ముందుండేవాడు. రాజశేఖరంలోని పొలైట్‌నెస్, స్మార్ట్‌నెస్ అందర్నీ ఆకట్టుకునేవి. బ్యాంక్‌కి ఎవరైనా పనిమీద వెళితే క్షణాలమీద పని చేసి వారిని పంపించేవాడు.

అనపర్తి బ్రాంచికి ట్రాన్స్‌ఫర్ కాబడ్డ రాజశేఖరంలోని పాజిటివ్ అప్రోజ్ ఆఫీసులోను, బయటా కూడా స్నేహితుల్ని సమకూర్చి పెట్టింది. ఒక వర్గానికి చెందిన కస్టమర్సు అందరి మనిషిలా మన్ననలు పొందుతున్న అతన్ని మచ్చిక చేసుకోవడం మొదలుపెట్టారు.

తను కూడా అదే కులస్తుడు కావడంతో మనసు వారివైపు మొగ్గడం ప్రారంభించింది.

కుల ప్రాదిపదికన జరిగే కార్యక్రమాలకి రాజశేఖరాన్ని ఆహ్వానించి ఒక పెద్దగా ప్రమోట్ చేసి హైలైట్ చేసేవారు. వారి పొగడ్తలు మరింతగా అతన్ని కమిట్ చేసేవి.



''మనం మనం ఒకటి. మనవారికి మీ ఇన్‌ఫ్లుయన్స్ ఉపయోగించి బ్యాంక్ ద్వారా రుణాలు ఇప్పించే ఏర్పాట్లు చేయించండి. మన కులస్తుల్ని మనం పైకి తీసుకురాకపోతే మరెవరు తీసుకువస్తారు? దయచేసి సహాయం చేయండి.''

వారి మాటల్ని కాదనలేకపోయాడు. బ్రాంచి మేనేజర్ దగ్గర తనకున్న మంచితనాన్ని వెచ్చించి వారికి రుణాలు ఇప్పించాడు. ఉపకారం పొందినవారు ఆ సమయంలో తనని ఆకాశానికి ఎత్తేసి మాట్లాడినా తదుపరి కాలంలో రుణం సక్రమంగా చెల్లించక తన పరువు తీసేసారు. మిగతా వర్గాలవారు మటుకు తీసుకున్న సొమ్ముల్ని సక్రమంగా చెల్లించేవారు.

తనని పెద్దమనిషిగా గౌరవించి తనకు చేదోడువాదోడుగా ఉండి సహకరించే ఆ స్నేహంతో కులం మత్తు వదిలిపోయింది. కుల జాడ్యంలో పడి అవివేకంగా నిర్ణయాలు తీసుకున్నందుకు తనను తానే నిందించుకున్నాడు.

మనిషిలోని మంచిని ప్రేమించాలేగానీ కులాన్ని కాదని తెలియవచ్చింది. మనం కొన్నింటికి అతీతంగా ఉంటే మనకందరూ దగ్గరవుతారని భావించాడు. జీవితంలో రాజశేఖరానికి అది ఒక గుణపాఠం.

ఓబులేసునుండి సంగతులు తెలుస్తూనే ఉన్నాయి. తమ పొలంలో కాసిన మామిడికాయలు, పనసకాయ, బెల్లంబుట్ట తీసుకుని వచ్చినప్పుడన్నాడు-

''అయ్యా! నా కొడుకుని మీరు చెప్పినట్లు కష్టపడి చదివించి ప్రయోజకుడ్ని చేసాను. ఇప్పుడు ఖమ్మంలో ఉద్యోగం చేస్తున్నాడు. నాకు ఇక్కడ గడవడమే కష్టంగా ఉంది. ఏదైనా సహాయం చేస్తాడనుకుంటే పూర్తిగా పట్టించుకోవడం మానేసాడు'' రాజశేఖరం సానుభూతి తెలియజేసాడేగానీ ఏమీ చేయలేకపోయాడు.

కారంచేడు బ్రాంచికి ట్రాన్స్‌ఫర్ అయిన తరువాత కూడా సాఫ్ట్‌నేచర్, సర్వీస్ ఓరియంటెడ్ మైండ్‌గల రాజశేఖరం అందరితోనూ కలసిపోయాడు. బ్యాంక్‌లో బాధ్యతగల స్థానంలో ఉండడంతో అతని సర్వీసెస్ అందరికీ అవసరం అయ్యేవి.


''మనందరం హిందువులం. మన జాతి హిందూ జాతి'' రెలిజియస్ ఫీలింగ్ తీసుకువచ్చి పనులు చేయించుకుందామని ప్రయత్నించేవారిని వారించలేకపోయేవాడు. మాటలతో ఆకట్టుకుని దానికి ష్యూరిటీ కావాలి, దీనికి ష్యూరిటీ ఉండాలి అంటూ వెంటపడే మనుషుల్ని కాదనలేకపోయేవాడు.

ఎవరైతే తన మతస్థులని దగ్గరకు చేరదీసాడో వాళ్ళు చిట్‌ఫండ్ కంపెనీలకు కట్టవలసిన సొమ్ములు కట్టక ఎగనామం పెట్టడంతో ష్యూరిటీ వున్న తనపై ఆ భారం పడింది. ఇతర మతస్థులు ఏ విధమైన ఇబ్బంది పెట్టక రూల్స్ పాటించి డ్యూస్ క్లియర్ చేయడంతో వారిమీద అభిమానం రెట్టింపయింది. అన్ని మతాలలోనూ మంచివారున్నారు. మతం మత్తులో మునిగితే మనిషికి మనుగడ శూన్యం అనే విషయం బోధపడింది. జీవితంలో ఇది రాజశేఖరానికి రెండో గుణపాఠం. బ్రతుక్కి హిందువు ఏమిటి, ముస్లిం ఏమిటి? క్రైస్తవుడేంటి? సంఘానికి గొడ్డలిపెట్టు లాంటి మతం పేరుతో పబ్బం గడుపుకున్నవాడిని దూరంగా ఉంచసాగాడు.

సుధకి పెళ్ళిచేసి అత్తవారింటికి పంపాడు. అల్లుడు గవర్నమెంటులో మంచి ఎగ్జిక్యూటివ్ కేడర్‌లో ఉన్నాడు. కూతురు మొగుడితో జత కలిపి అది కావాలి, ఇది కావాలి అంటూ మనస్తాపం కలిగించేది. అప్పుడు ఓబులేసు మాటలు తనని సేదదీర్చేవి. తన కొడుకు తనని ఎలా ఇబ్బంది పాల్జేస్తున్నదీ, తమని ఇంట్లోంచి ఎలా బయటకి నెట్టివేసిందీ చెబుతుంటే ఎంతో బాధపడేవాడు రాజశేఖరం.

## కటీఫ్‌లు

★ రాణీముఖర్జీ, గోవిందా ఈమధ్య మాట్లాడుకోవడం తగ్గించారట. (అంటే ఏమిటి?)



★ సల్మాన్, ఐశ్వర్యా విడిపోయారట.

★ లియాండర్ పేస్, మహిమా.. మొహామొహాలు చూసుకోవట్లేదట.

★ నగ్మా, సౌరవ్‌ల కథ కంచికి వెళ్ళిందిట...

★ రోజా, వెంకటేష్‌లు ఎప్పటినుండో కటీఫ్‌లు.

★ అర్జున్, మధుబాల మాట్లాడుకోవడం లేదట.

## నిజ్జమా..!

★ రోజా కొన్ని విషయాలు స్ట్రయిట్‌గా మాట్లాడేస్తుంది. కమల్ మీద అలాంటి సెటైర్లే ఈమధ్య విసిరిందిట.

★ రోజాను చూసయినా బుద్ధి తెచ్చుకోకుండా, రంభకు సినిమా తీయాలన్న కోరికేమిటో.. అంటూ రంభ వెనక గుసగుస లాడుకుంటున్నారుట.

★ సౌందర్యకు తెలుగులో సినిమాలు తగ్గాయి. కొత్త హీరోయిన్లు, పరభాషా తారలు ఆ స్థానాన్ని భర్తీ చేస్తున్నారు(ట).

- ప్రియ

ప్రమోషన్ మీద తమిళనాడు దగ్గర పెరుంబుదూర్ బ్రాంచికి ట్రాన్స్‌ఫర్ కాబడ్డాడు. షరా మామూలే. మన తెలుగు వాళ్ళంటూ ఒకటైన తమిళ తెలుగు సోదరులలో రాజశేఖరం కూడా చేరిపోయాడు. పెరుంబుదూర్ తెలుగు అసోసియేషన్‌లో యాక్టివ్ మెంబర్ అయిపోయాడు. లాంగ్వేజ్ ఫీలింగ్‌తో ఏర్పడ్డ స్థానిక వేర్పాటువాదం ప్రబలి ఒక్కోసారి అతన్ని చిక్కులో పడేసేది. అప్పుడు నా అనుకున్న తెలుగువారి సహాయం కొరవడేది. భాష పేరుతో చేరదిసి తమ స్వలాభాలకు ఉపయోగించుకుంటుండడంతో కళ్ళు తెరవక తప్పలేదు.

మరొకవైపు ప్రొఫెషనల్ టచ్‌తో కష్టపడి పనిచేసి అభివృద్ధివైపు సాగిపోయే అక్కడివారిని చూస్తే ముచ్చటవేసేది. మనిషి మనుగడకు భాష ముఖ్యంకాదు, వివిధ ప్రాంతాల సంస్కృతులను, సాంప్రదాయాలను మన్నించక సర్వభాషా సహనాన్ని పాటించనప్పుడు మనిషి పశుత్వాన్ని ఆపాదించుకుంటాడు. తను చేసిన పని తనని చివరకు సిగ్గుపడేలా చేసింది. రాజశేఖరానికి జీవితం నేర్పిన మూడో పాఠం ఇది.

ఓబులేసు భార్య కాలం చేసిందని తెలిసి అరుంధతి, రాజశేఖరం చాలా బాధపడ్డారు. 'భార్యను కోల్పోయి, కొడుకు ఆదరణకు నోచుకోని అతను ఆ పల్లెటూలో ఎలా వుంటాడో' జాలిపడడం తప్ప ఏమీ చేయాలనిపించలేదు అతనికి.

పెరుంబుదూర్ నుండి పంజాబ్‌కి బదిలీ కాబడ్డ రాజశేఖరం అక్కడ రీజనల్ ఫీలింగ్ చట్రంలో ఇరుక్కున్నాడు. దక్షిణాది రాష్ట్రాల నుండి వచ్చిన వారందరూ అక్కడ ఒక వర్గం. చివరికి మనీ మేటర్స్‌లో తనకు దగ్గరయినవారితో విభేదాలు పొడచూపాయి.

పంజాబీల కమిట్‌మెంట్, త్యాగగుణాల ముందు తమ సంకుచితత్వం దిగదుడుపు అయింది.

మానవుడు ఖండాంతరాలనధిగమించి రోదసీ యానం చేస్తూ చంద్రమండలంలోకి కూడా అవలీలగా అడుగిడుతున్న ఈ వర్తమాన కాలంలో కులం, మతం, భాష ప్రాంతీయ అసమానతలతో గిరిగీసుకుని కూర్చుంటే విస్తరిస్తున్న విశాల దృక్పథం చతికిలబడుతుంది. అప్పుడు మనిషి మానసికంగా మసిబారి సామాజికంగా సర్వనాశనమై వైజ్ఞానికంగా విలువ కోల్పోతాడు. తద్వారా నీలాకాశంలో రెక్కలు విప్పి ఎగురుతున్న ప్రగతి కపోతాళు రెక్కలు తెగి క్రిందపడిపోయే అవకాశం లేకపోలేదు.

భావాలను విస్తరించుకోలేని మనిషి అసంపూర్ణ మానవుని గానే మిగిలిపోతాడు. చివరికి అతని జీవితం సశేషంగానే మిగిలిపోతుంది.

వాస్తవానికొచ్చిన రాజశేఖరంలో ఏదో వెలితి, తెలియని అగాధం కనిపిస్తున్నాయి. బలహీనతలకు అతీతంగా వ్యవహరించిన తను సర్వీస్‌ను జంటిల్‌గానే పూర్తి చేసాడు.

రిటైరైన తను ఇప్పుడైనా బయాస్ లేకుండా బ్రతకగల్గుతున్నాడా? కళ్ళు మూసుకుని గుండెని తడిమితే 'నెవ్వర్'... అని సమాధానమిచ్చింది.

భార్య అరుంధతి, కూతురు సుధ. తనవారి మీద ఎఫెక్షన్ ఉండాలిగానీ ఇతరులను డౌన్ చేసేంతగా ఉండకూడదు. కన్నకూతురిని తండ్రిగా పెంచి పెద్ద చేసాడు. చదువు చెప్పించాడు. వివాహంచేసి పంపించాడు. అక్కడితో తన బాధ్యత తీరినట్టు లెక్క. మమకారంతో పదివేల రూపాయలు పంపితే తండ్రిననే భావన లేకుండా తిప్పికొట్టింది. సర్వీసులో చేసిన తప్పులు ఇప్పుడు పునరావృతమయ్యాయా? అసలు ఆమెకు ఎంత ఇస్తే తృప్తి చెందుతుంది? అంతా ట్రాష్!

రిటైరై సీనియర్ సిటిజన్ అయిన తన జీవితం సిన్సియర్‌గా ముందుకు సాగిపోవాలిగానీ సశేషంగా మిగిలిపోకూడదు. ఠక్కున ఏదో స్ఫురించడంతో హృదయం ఒకింత గట్టిపడింది. తనలో తాను నవ్వుకుంటున్న భర్తని వింతగా చూస్తోంది అరుంధతి.

సరిగ్గా గేటు తీసుకుని లోపలికి వస్తున్న పనిమనిషి మహలక్ష్మిని ''ఇటురా'' అని గద్దించడంతో ఆమెతో పాటు భార్య కూడా హడలిపోయింది.

''ఏమేవ్! నువ్వు రెండొందలు జీతం పెంచమన్నావు కదూ! ఈ ఐదు వందల రూపాయలతో ఎలా బ్రతుకుతావు చెప్పు! ఈనెల నుండి నీ జీతం మరో ఐదువందలు కలిపి వెయ్యి రూపాయలు చేస్తున్నాను!

అరూ! ఆ బీరువాలో వున్న వెయ్యి రూపాయలు మహలక్ష్మికి ఇచ్చి పంపు.''

ఒక్కసారి మనస్సులో ఓబులేసు మెదిలాడు. తన తాతల నుండి పొలాన్ని దుక్కిదున్ని సుక్షేత్రం చేసి క్రమంగా తనకివ్వవలసిన సొమ్ముల్ని అణాపైసలతో లెక్క చెప్పేవాడిది తన కులమా? తన మతమా? యజమాని పొలాన్ని ఆక్రమించుకోవాలని పన్నాగాలు పన్నుతున్న ఈ రోజుల్లో ఎంతో నిజాయితీని ప్రదర్శిస్తున్న ఓబులేసు నిజమైన ఆత్మబంధువు. కొడుకు ఇతన్ని తన్ని తరిమేస్తే చాలీచాలని బ్రతుకును వెళ్ళబుచ్చుతున్న అతను తనకెప్పుడూ ఇది కావాలని ఏమీ అడగలేదు. తనకివ్వవలసిన సొమ్ముల్ని ఎప్పుడూ ఎగనామం పెట్టనూలేదు. భార్యపోయిన ఆ ఒంటరి జీవితానికి ఏదో సహాయం అందించాలి. వాడు ఏడాదికి తనకు రెండు బస్తాల శిస్తు పెంచడం ఏమిటి? తనే ఎకరానికి ఇకనుండి ఐదుబస్తాల శిస్తు తగ్గిస్తే సరి!

ఇది ముగింపు కాదు, ప్రారంభమే అయినా ఎందుకో ఆ భావనతో మనసు తేలికపడి ఆనందంగా ఊపిరి పీల్చుకున్నాడు రాజశేఖరం!

★

